క్లుప్తంగా

మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఏకమవుదాం

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ముస్లింలు, దళితులు, ఆదివాసీలు, బీసీలు, క్రైస్తవులు, ఇతర సెక్యూలర్ వాదులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని యునైటెడ్ ముస్లిం అడ్వయిజరీ ఫోరం ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫోరం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతోన్మాద శక్తులకు అధికారాన్ని దూరం చేయడానికి ఐక్యంగా పని చేద్దామని కోరారు. ఫోరం కన్వీనర్ గులాం గౌస్, కోకన్వీనర్లు ఖాలెద్ నవీద్, హాజీ సలీం, మీర్ షోయబ్అలీ, షేక్ సిరాజుద్దీన్, మౌల్వి మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

9న వ్యాసరచన పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ పాలమూరుశాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న పాఠశాల విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగులో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు పి.రమేష్‌చందర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు జూనియర్స్ విభాగంలో 9,10 తరగతుల వారికి సీనియర్స్ విభాగంలో వ్యాసరచన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. మిగతా వివరాల కోసం భూషణ్‌పాండే (9849340276), చంద్రుడు (9705848026) నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

నియామక ఉపసంహరణ

గండీడ్: కాంగ్రెస్ పార్టీకి సంబంధించి పరిగి బీసీ సెల్ జనరల్ సెక్రటరీ నియామకాన్ని ఉపసంహరిస్తున్నట్లు మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంతకు ముందు లింగాయిపల్లికి చెందిన వెంకటేశ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల ఉపసంహరణ చేసుకుంటున్నట్లు వివరించారు. విషయానికి సంబంధించి పరిగి బీసీ సెల్ అధ్యక్షుడు నర్సిములు లిఖిత పూర్వకంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

8న సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఐఎన్‌టీయూసీ అనుబంధ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) రీజియన్ విస్తృతస్థాయి సమావేశం 8న జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నాయకులు సాయిరెడ్డి, విజయ్‌బాబు శనివారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి తదితరులు రానున్నట్లు వివరించారు.

నేడు పుస్తక పరిచయ సభ

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర తెలంగాణ సాహితీ అధ్యక్షుడు, ప్రముఖ రచయిత వల్లభాపురం జనార్దన రచించిన నాలుగు పుస్తకాల పరిచయ సభ ఆదివారం జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా ప్రముఖ రచయిత వైద్యం భాస్కర్ రచించిన పాటల సీడీ విడుదల చేస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

బిల్లులు చేయకుండా అడ్డుపడడం సరికాదు

జడ్చర్ల: అభివృద్ధి పనుల బిల్లులు చేయకుండా అధికార పార్టీకి చెందిన వారు అడ్డుపడడం సరికాదని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బిల్లులు రాకపోవడంతో ఆత్మహత్యాయత్నం చేసిన నవాబ్‌పేట మండలం దేపల్లి ఉపసర్పంచ్ యశోద భర్త దామోదర్‌ను శనివారం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు. నాయకులు తదితరులు ఉన్నారు.

సదస్సులో పాల్గొన్న భీంపల్లి శ్రీకాంత్

స్టేషన్ మహబూబ్‌నగర్: దోమకొండ సంస్థానం ఆధ్వర్యంలో 'తెలుగు సాహిత్య అభ్యున్నతికి తెలంగాణ సంస్థానాల వారి సేవ' అంశంపై నిర్వహించిన సదస్సులో జిల్లాకు చెందిన ప్రముఖ పరిశోధకులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా దోమకొండ సంస్థానంలో జరిగిన కార్యక్రమంలో 'లోకాయపల్లి సంస్థానం–సాహిత్య సేవ' అంశంపై పత్రసమర్పణ చేశారు. అనంతరం ఆయనను దోమకొండ సంస్థానాధీశులు అనిల్ కామినేని తదితరులు శాలువాతో సత్కరించారు. తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య తంగెడ కిషన్‌రావు, శ్రీకంచి చంద్రశేఖర సరస్వతి విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జడ్చర్ల టౌన్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎంఈఓ మంజులాదేవి స్థానిక బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, ఆర్పీ తిమోతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కోడ్గల్‌లో వైద్య శిబిరం

జడ్చర్లటౌన్: కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం విద్యార్థులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రక్తనమూనాలను పరీక్షించి బ్లడ్ గ్రూప్‌లను తెలియజేశారు. దాదాపు 180 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శివకాంత్, ఏఎన్‌ఎం కరుణ తదితరులు పాల్గొన్నారు.


ఇప్పటూర్‌లో మాట్లాడుతున్న అధికారులు


బూర్గుపల్లిలో ప్రజాపాలనలో పాల్గొన్న అధికారులు

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'ప్రజాపాలన'లో భాగంగా చివరిరోజు శనివారం పట్టణ పరిధిలో 5,730 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 'అభయహస్తం'వి 5003, ఇతర సమస్యలపై 727 ఉన్నాయి. కార్యక్రమం గత నెల 28న ప్రారంభం కాగా ఈనెల 6వ తేదీతో ముగిసింది. మధ్యలో రెండు రోజులు సెలవు ఉండగా మొత్తం ఎనిమిది రోజుల పాటు కొనసాగింది. దీంతో మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 49 వార్డులలో మొత్తం 58,769 దరఖాస్తులను ప్రజలు అందజేశారు. వీటిలో 'అభయహస్తం'వి 55,264, ఇతర సమస్యలపై వచ్చినవి 3,505 ఉన్నాయి. ప్రస్తుతం ఈ దరఖాస్తులను 'ఆన్‌లైన్'లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 17వ తేదీతో ముగియనుంది.

చిన్నచింతకుంట: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం నేటితో ముగిసింది. ఆరు రోజులపాటు గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో 11,742 మంది దరఖాస్తులు అందజేశారు. అల్లిపురంలో 552, అమ్మపురంలో 612, బండ్రపల్లిలో 646, చిన్న వడ్డేమాన్‌లో 370, చిన్నచింతకుంటలో 1,939, దమగ్నాపురంలో 593, ఏదులాపురంలో 253, పర్దిపురంలో 848, గోప్యానాయక్ తండాలో 209, గూడూర్‌లో 266, కురుమూర్తిలో 723, లాల్‌కోటలో 896, మద్దూర్‌లో 540, నెల్లికొండిలో 727, పల్లమర్రిలో 448, సీతారాంపేటలో 262, ఉంద్యాలలో 1,416, పెద్ద వడ్డేమాన్‌లో 442 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సి.కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.


చిన్నచింతకుంటలో దరఖాస్తుల ఆన్‌లైన్ పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

కోయిల్‌కొండ: మండలంలో ఈనెల 6 వరకు 44 గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమంలో 17,684 దరఖాస్తులు ప్రజల నుంచి తీసుకున్నామని ఎంపీడీఓ జయరాములు తెలిపారు. అదేవిధంగా రేషన్‌కార్డు తదితరాల కోసం 7,110, మొత్తం 24,794 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

బాలానగర్: మండల పరిధిలో మొత్తం 15,198 దరఖాస్తులు వచ్చాయి. 37 గ్రామాలకు గానూ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి క్లస్టర్ పరిధిలో 13 గ్రామ పంచాయతీల్లో 4,496, ఎంపీఓ విజయ కుమారి క్లస్టర్‌లో 12 గ్రామాల్లో 5,555, అదే విధంగా ఎంపీడీఓ కృష్ణారావు పరిధిలోని 12 గ్రామ పంచాయతీల్లో 5,147 దరఖాస్తులు వచ్చాయి. ఆదివారం నుంచి ఆన్‌లైన్ చేయనున్నట్లు మండల ప్రత్యేక అధికారి బాబురావ్, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

గండీడ్/మహమ్మదాబాద్: ఉమ్మడి గండీడ్ మండలంలో ప్రజాపాలనలో 3,110 దరఖాస్తులు వచ్చాయి. శనివారం గండీడ్‌లోని కొండాపూర్‌లో అభయ హస్తం 454, జనరల్ 129, పంచాంగల్ తండాలో అభయహస్తం 230, జనరల్ 91, చిన్నవార్వాల్‌లో 396, జనరల్ 90, రుసుంపల్లిలో 463, జనరల్ 143 మహమ్మదాబాద్ మండలంలో జూలపల్లిలో 697, జనరల్ 125, షేక్‌పల్లిలో 260, జనరల్ 132 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్‌లు నాగలక్ష్మి, ఏసయ్య, ఎంపీఈఓ శంకర్‌నాయక్‌లతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


జిల్లాకేంద్రంలోని 29వ వార్డులో..

నవాబుపేట: మండలంలో ప్రజాపాలన దరఖాస్తులు 20 వేలు దాటాయి. పథకాలకు సంబంధించి 17,919 దరఖాస్తులు, రేషన్‌కార్డులు తదితర వాటికి 5,231 మొత్తం 23,150 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ శ్రీలత వివరించారు. మండలంలో 54 గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. శనివారం ఇప్పటూర్‌లో జరిగిన కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి సురేందర్ పాల్గొన్నారు.

వెలుగొమ్ములలో ప్రత్యేక పూజలు

మిడ్జిల్: వెలుగొమ్ములలో నూతనంగా ప్రతిష్ఠించిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వేరువేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సర్పంచ్ ఆంజమ్మ, జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మాజీ ఎంపీపీ కాంతమ్మ, నాయకులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన


డ్రోన్ల వినియోగాన్ని వివరిస్తున్న అధికారులు, నాయకులు

గండీడ్: డిజిటల్ యుగంలో మోదీ మార్కు పాలన కొనసాగుతుందని బీజేపీ మెడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ గిరమోని శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సల్కర్‌పేటలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో డ్రోన్‌ల ద్వారా మందు పిచికారీపై అవగాహన కల్పించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సాగును తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మహిళా సంఘాలకు 80 శాతం సబ్సిడీపై మందులు పిచికారీ చేయడానికి డ్రోన్లను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సంబంధిత అధికారులు, బ్యాంకు ఉద్యోగులు, సర్పంచ్ జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు జూనియర్ కళాశాలల సంఘం అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, కార్యదర్శిగా వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా జగన్, ఉపాధ్యక్షుడిగా సురేష్ ఎన్నికయ్యారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయి ఈసీ మెంబర్‌గా జహీర్ అక్తర్, ఉమ్మడి జిల్లా స్థాయి ఈసీ మెంబర్‌లుగా రమేష్‌గౌడ్, సతీష్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని ఘనంగా సన్మానించారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తమపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించేందుకు అహర్నిశలు శ్రమిస్తామని వివరించారు.

పట్టువస్త్రాల సమర్పణ

స్టేషన్ మహబూబ్‌నగర్: ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక టీడీ గుట్టలోగల తిరుమలనాథ వేంకటేశ్వరస్వామికి గోదా కల్యాణం కోసం శనివారం పట్టువస్త్రాలు సమర్పించారు. పట్టువస్త్రాలతో ఊరేగింపుగా దేవాలయానికి వెళ్లారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వచ్చిందే వేళ.. చెప్పిందే పాఠం

- ఉపాధ్యాయుల ఇష్టారాజ్యం
- సమయపాలన పాటించడంలో నిర్లక్ష్యం

మిడ్జిల్: మండల కేంద్రంలోని కస్తూర్బాలో పనిచేసే ఉపాధ్యాయినులు, సిబ్బంది తీరు వచ్చిందే వేళ, చెప్పిందే పాఠం అన్న చందంగా తయారైంది. పాఠశాల గ్రామానికి చివరలో ఉండడంతో అటువైపు ఎవరు కన్నెత్తి చూడక పోవడంతో ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం 7గురు ఉపాధ్యాయినులకు గానూ ప్రార్థనకు కేవలం ఇద్దరు మాత్రమే హాజరు అయ్యారు. కేజీబీవీలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది దాదాపు 20 మంది వరకు ఉండగా ఎవరూ సరిగా విధులకు రావడం లేదని.. వంతుల వారీగా నిర్వహిస్తూ విషయం బయటకు పోకుండా జాగ్రత్త పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నత అధికారులు పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈవిషయంపై ప్రత్యేకాధికారిణి కవితను వివరణ కోరగా బస్సులు ఆలస్యంగా రావడంతో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు.


ప్రార్థనలో పాల్గొన్న ఇద్దరే టీచర్లు

ఆగిపోయిన రోడ్డు రోలర్

- స్తంభించిన ట్రాఫిక్
- గంటపాటు వాహనదారులకు ఇక్కట్లు


నిలిచిన వాహనాలు

మహమ్మదాబాద్: రోడ్డు రోలర్ ఆగిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహమ్మదాబాద్ సమీపాన రామాలయం వద్ద కొత్తగా బ్రిడ్జి నిర్మిస్తున్నారు. దీనికోసం పాత బ్రిడ్జి కూల్చి వాహనాలు వెళ్లేందుకు పక్క నుంచి రోడ్డు వేశారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో రోడ్డు పనిచేస్తున్న రోలర్ ఆగిపోయింది. దానిని పక్కకు తప్పించే వీలు లేకపోవడంతో రెండు వైపుల వాహనాలు నిలిచిపోయాయి. గంట సేపు ట్రాఫిక్ జామైంది. ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకున్న మహమ్మదాబాద్ ఎస్‌ఐ సురేష్ అక్కడికి తన సిబ్బందితో చేరుకుని రోలర్‌ను పక్కకు తప్పించారు. దీంతో ట్రాఫిక్ క్లియరైంది.

సమస్యలు పరిష్కరించాలి

కోయిల్‌కొండ: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి మొగులయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. టెట్ నుంచి టీచర్లకు మినహాయింపు ఇచ్చి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. హెచ్‌ఎం వెంకటాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షతలు


బోయపల్లిలో అక్షతలను పంపిణీ చేస్తున్న నాయకులు


గోపాల్పూర్‌లో..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని స్థానిక 16వ వార్డు పరిధిలోని బోయపల్లిలో శనివారం అయోధ్య రాముడి అక్షతల ఇంటింటి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నాయకులు మనోహర్ రావు, పిట్ల యాదయ్య, గోవర్ధన్, సంజీవ్, సోమేష్, శ్రీశైలం, సిద్దు, మధుగౌడ్, అరుణ్ పాల్గొన్నారు.

దేవరకద్ర: పట్టణంలో శనివారం అయోధ్య శ్రీరామ మందిర పూజిత అక్షతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. విశ్వహిందు పరిషత్ కార్యకర్తలు, ఆర్య వైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు. గోప్లాపూర్‌లోనూ పంపిణీ సాగింది.

హన్వాడ: పెద్దర్పల్లిలో అక్షతల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకుడు రఘురాంగౌడ్, సర్పంచ్ వెంకన్న, ఎఫ్ఏసీఎస్ వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దర్పల్లిలో అక్షతల ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

యువకుడి అదృశ్యం


- జిరాక్స్ సామగ్రి తెస్తానని వెళ్లిన వైనం

మహమ్మదాబాద్: ఓ యువకుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసునమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. షేక్‌పల్లి తండాకు చెందిన కాట్రావత్ మహేశ్(28) నంచర్ల గేటులో జిరాక్స్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. గత డిసెంబర్ 22న తుల్జాభవాని పండుగ కోసం తండాకు వెళ్లాడు. తర్వాత 31న షాపులోకి జిరాక్స్ సామగ్రి తీసుకువస్తానని చెప్పి.. హైదరాబాద్ వెళ్తానని ఇంట్లోంచి వెళ్లాడు. వారం రోజులైనా తిరిగి రాకపోవడంతో అతడి తల్లి పున్నిబాయి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

అడ్డాకుల: జానంపేట మాజీ సర్పంచ్ బండ రాంరెడ్డి(93) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాంరెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీలు ఎల్లగౌడ్, బగ్గి కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్, విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, భాస్కర్‌గౌడ్, మల్లయ్య, మశ్చందర్‌నాథ్ తదితరులు సంతాపం తెలిపి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేత



అడ్డాకుల: కందూర్‌కి చెందిన మహేష్ యాదవ్ కొన్నాళ్ల కిందట రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. అతడికి బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉంది. దీంతో పార్టీ ఇన్సురెన్స్ ద్వారా బాధిత కుటుంబానికి రూ.2లక్షల చెక్కు మంజూరైంది. మహేష్ తల్లి సుగుణమ్మకు శనివారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మున్నూర్ శ్రీకాంత్‌లు చెక్కును అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, రమేష్ యాదవ్, తిరుపతయ్య ఉన్నారు.

సంతాపం

అడ్డాకుల: మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు శశివర్ధన్‌రెడ్డి ఆకస్మికంగా మృతి చెందిన నేపథ్యంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి శనివారం అన్నాసాగర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శశివర్ధన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు వంశీకృష్ణ



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం ఏనుగొండకు చెందిన వంశీకృష్ణ రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవలే గద్వాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో వంశీకృష్ణ పాల్గొని జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈనెల 18 నుంచి ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నాడు.

బాలానగర్‌లో ఫ్లైఓవర్ నిర్మించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని బాలనగర్ మండల కేంద్రం చౌరస్తాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తక్షణమే ఫ్లైఓవర్ నిర్మించాలని జెడ్పీ సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్, బాలానగర్ జెడ్పీటీసీ కల్యాణి కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ రవి నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు.

రాచాల రోడ్డులో 'తారు'మారు

- కొత్త రోడ్డు వేసిన వారానికి గుంతలమయం
- గుంతల రోడ్డుతో గ్రామస్తుల అవస్థలు

అడ్డాకుల: మండలంలోని రాచాల రోడ్డుపై అంతా 'తారు'మారైంది. కొత్త రోడ్డు వేసిన ఆనందం వాహనదారుల్లో వారమైనా నిలవకుండానే వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. బీటీ రెన్యువల్ నిధులతో రోడ్డు వేస్తే సుమారు 14 చోట్ల రోడ్డుపై గుంతలు ఏర్పడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొన్నకల్ చెరువు కట్ట నుంచి రాచాల వరకు 4.3కిలోమీటర్ల దూరం గతంలో రోడ్డంతా గుంతలమయంగా మారడంతో గత ప్రభుత్వంలో బీటీ రెన్యువల్ కోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఎంఆర్ఆర్ కింద రూ.2.40కోట్లు మంజూరయ్యాయి. 2023 జూన్ చివరి వారంలో బీటీ రెన్యువల్ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డు నాణ్యతగా చేపట్ట లేదు. దీంతో వేసిన నాలుగైదు రోజులకే గుంతలు ఏర్పడ్డాయి. తర్వాత వాటిని బాగు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో సర్కారు నిధులు రోడ్డు పాలయ్యాయి. అప్పటి నుంచి గుంతల రోడ్డుతో గ్రామస్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్డు పనులు నాణ్యతగా లేకపోవడంతో పంచాయతీరాజ్ అధికారులు బిల్లులు చేయలేదు. తారు రోడ్డుపై అంతా తారుమారు కావడంతో బిల్లులు కాక కాంట్రాక్టర్, రోడ్డు బాగోలేక వాహనదారులు అవస్థలకు గురవుతున్నారు.

మళ్లీ తారును 'తీసి'..!

పొన్నకల్ చెరువు కట్ట నుంచి రాచాల వరకు వేసిన బీటీరోడ్డు నాసిరకంగా ఉండటం వల్ల సుమారు 14 చోట్లకు పైనే రోడ్డు ధ్వంసమైంది. నిత్యం వాహనాల రాకపోకలతో గుంతలు పెద్దగా మారాయి. అధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్ గుంతలను పూడ్చి వాటిపై మళ్లీ తారు వేసేందుకు... ఇటీవల రోడ్డుపై గుంతలు ఏర్పడిన చోట కొంత దూరం తారును తీశారు. అయితే సకాలంలో వాటిని బాగు చేయించడంలో తాత్సారం జరుగుతోంది. దీనివల్ల తారును తీసిన చోట వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల రోడ్డుపై కంకర తేలడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి గుంతలు ఏర్పడిన చోట వెంటనే వాటిని బాగు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రాచాల బీటీరోడ్డుపై తేలిన కంకర


గుంతలు పడిన చోట తొలగించిన తారు

గుంతల్లో తారును తీశారు

పనుల్లో నాణ్యత లోపించి రోడ్డు వేసిన కొన్ని రోజులకే మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. దీనివల్ల వాటిని బాగు చేయించాలని చెప్పడంతో రోడ్డు గుంతల్లో ఇటీవల తారును తీశారు. సంబంధిత కాంటాక్టర్ వారి ఇంజనీయర్‌తో వస్తేనే పనులు చేయించాలని చెప్పాను. క్వాలిటీ కంట్రోల్ అధికారులు వచ్చి నివేదిక ఇచ్చే వరకు ఎంబీ రికార్డు చేయం.
– వేణుగోపాల్‌రెడ్డి, పీఆర్ ఏఈ, అడ్డాకుల